సంపుటి :02 సంచిక :87 పేజీలు :05
వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com
Voice of the people

శుక్రవారం 16, మే 2025

ఉష్ణోగ్రతలు
కనిష్ఠం : 27
గరిష్ఠం : 36

## ఐదు రోజులు వర్షాలు

12 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్
హైదరాబాద్ వాతావరణశాఖ ప్రకటన

02



## స్వాగత తోరణం



- వేగవంతంగా సాగుతున్న పలు అభివృద్ధి పనులు
- పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

03



## ఆధ్యాత్మిక చైతన్యం

- భక్తులతో ఘాట్లు కిటకిట
- సరస్వతి ఘాటు వద్ద పుణ్యస్నానాలు
- కాళేశ్వరం సందర్శించిన డిప్యూటీ సీఎం, ప్రత్యేక పూజలు

04

సరస్వతి పుష్కరాలను పురస్కరించుకొని శుక్రవారం కాళేశ్వరంలోని ఘాట్లు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పుష్కర స్నానాల కోసం సరస్వతి ఘాట్ చేరుకొని పుణ్యస్నానాలు ఆచరించారు. పుష్కర స్నానానికి ఎంతో పవిత్రత కలిగిన ఈ సందర్భాన్ని భక్తులు ఆధ్యాత్మికంగా జరుపుకున్నారు. భక్తుల రాకతో ఘాట్ల వద్ద ఆధ్యాత్మిక చైతన్యం కనిపించింది. అధికారులు భక్తులకు మార్గనిర్దేశనం చేశారు. పుష్కర స్నానంతో పాటు భక్తులు నదీ తీరాల్లో హారతులు సమర్పిస్తూ, దానం చేస్తూ తమ ఆధ్యాత్మికతను చాటుకున్నారు. పుష్కరాల వేడుకలు ఇంకా 10 రోజులు కొనసాగనున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం లో త్రివేణి సంగమం వద్ద గురువారం సరస్వతి పుష్కరాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ ప్రారంభోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రులు డి శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తదితరులతో కలిసి పాల్గొన్నారు.

– అక్షరదర్బార్, కాళేశ్వరం

## పొలిటికల్ లీడర్ల బహిరంగ విచారణకు నో

02

- సూత్రప్రాయంగా కాళేశ్వరం విచారణ కమిషన్ నిర్ణయం
- న్యాయపరంగా చిక్కులు వద్దనుకోవడమే కారణం
- ఈ నెలాఖరులోపు సర్కార్‌కు నివేదిక



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలోని మేడిగడ్డ బరాజ్ అనతికాలంలోనే కుంగిపోయింది. సుందిళ్ల, అన్నారం బరాజ్‌ల పరిధిలో నిర్మాణ పరంగా లోపాలు తలెత్తాయి. దీని వెనుక ఉన్న కారణాలు తెలుసుకునేందుకు సర్కార్ నియమించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణను తుది దశకు తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో కమిషన్ కు న్యాయపరమైన చిక్కులు ఎదురు కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నది. దీనిలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్, నాటి మంత్రి హరీశ్ రావును బహిరంగంగా విచారించవద్దని సూత్రప్రాయంగా నిర్ణయించింది.

– అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి

## నేరస్తుల మూలాలను కనిపెట్టాలి

04



- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- వెస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల సందర్శన

## కమీషన్ల దుమారం

- తీసుకునే మంత్రుల వివరాలు చెప్పాలి
- సీఎం రేవంత్ వారిపై విచారణ జరిపించాలి
- నిజాలు ఒప్పుకున్నందుకు సురేఖకు అభినందనలు
- ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నా వ్యాఖ్యలను వక్రీకరించారు
- బీఆర్ఎస్ హయాంలో మంత్రుల కమీషన్ల గురించే నేను మాట్లాడా
- నాపై కావాలనే కొందరి తప్పుడు ప్రచారం
- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

02



రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు మరోసారి రాజకీయంగా దుమారం రేపాయి. ఫైళ్లను క్లియర్ చేసేందుకు మంత్రులు మామూలుగా డబ్బులు తీసుకుంటారంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు తాజాగా వివాదానికి దారితీశాయి. కమీషన్లు తీసుకునే మంత్రుల వివరాలు చెప్పాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారిపై విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. నిజాలు ఒప్పుకున్నందుకు మంత్రి కొండా సురేఖకు నా అభినందనలు అని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉంటే తాను చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని, బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో మంత్రుల కమీషన్ల గురించే తాను మాట్లాడానని అన్నారు. అయితే కొందరు కావాలని తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో మంత్రుల కమీషన్ వ్యాఖ్యలు పొలిటికల్ గా సంచలనం కలిగించాయి. ప్రస్తుతం ఈ అంశం రాజకీయంగా హాట్ టాపిక్ అయింది.

–అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి



KTR @KTRBRS · 7h

Many congratulations to Minister Konda Surekha garu for finally speaking some truths!

Congress in Telangana runs a “commission sarkaar”, and it's unfortunate this has become an open secret in Telangana

In this 30% commission government, ministers, according to their own colleague minister do not sign files without taking a hefty cut

Contractors even staged a dharna inside the secretariat, exposing the Govt’s commission business.

I request Konda Surekha garu to name and shame all the Congress ministers involved

Can Revanth Reddy or Rahul Gandhi order an inquiry into these allegations by their own cabinet minister?

#CongressFailedTelangana

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం
# రైతుల పాలిట శాపం

**బీజేపీ మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్**

అక్షర దర్బార్, చిట్యాల : విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం చిట్యాల మండల రైతుల పాలిట శాపంగా మారిందని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆరోపించారు. చిట్యాల మండలంలోని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన పాలెపు మాధవిరాంబాబు అనే రైతు తనకున్న ఎకరం 20 గుంటల భూమిలో ఎర్రచందనం, శ్రీగంధం, జామ, మామిడి పంట సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం ప్రమాదవశాత్తు కరెంటు వైర్లు తెగి పంట పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు. అదేవిధంగా చింతకుంట రామయ్యపల్లిలో, గుంటూరు పల్లె గ్రామం తిరుమలాపూర్ శివారులో కూడా 30 ఎకరాల్లో మొక్కజొన్న, వరి, జామాయిల్ పంట పూర్తిగా దగ్ధమై రైతులకు లక్షల్లో నష్టం వాటిల్లిందని తెలిపారు. దశాబ్దాల కింద ఏర్పాటు చేసిన కరెంటు తీగలు తెగిపడి అగ్ని ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయని ఆయన అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్తు అధికారులను వెంటనే సస్పెండ్ చేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.







# తెలంగాణలో ఐదు రోజులు వర్షాలు

- 12 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్
- హైదరాబాద్ వాతావరణశాఖ ప్రకటన

తెలంగాణ అక్షర దర్బార్ : తెలంగాణవ్యాప్తంగా ఐదు రోజుల పాటు వర్షాలు పడే అవకాశముందని హైదరదాబాద్ వాతావరణ శాఖ శుక్రవారం ప్రకటించింది. బంగాళాఖాతంలో ద్రోణి ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. శుక్రవారం తేలికపాటి మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు మెరుపులు, ఈదురు గాలులు అధికంగా ఉండడంతో పాటు అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉందని తెలిపింది. ఈరోజు ఈదురుగాలులు, వర్షాలు కురిసే ప్రభావంతో పశ్చిమ, పలు దక్షిణ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ చేసింది. నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నారాయణపేట, నాగర్ కర్నూల్, వనపర్తి జోగులాంబ గద్వాల్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్. ఈ జిల్లాలో గంటకు 50_ 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు , 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. రానున్న ఐదు రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదుకానున్నాయి. ఈ రోజు నగరంలో ఈదురుగాలులు అధికంగా వీచే అవకాశం ఉండటంతో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. నగరంలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షం అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది.

# కమీషన్ల దుమారం

- కమీషన్లు తీసుకునే మంత్రుల వివరాలు చెప్పాలి
- సీఎం రేవంత్ వారిపై విచారణ జరిపించాలి
- నిజాలు ఒప్పుకున్నందుకు సురేఖకు అభినందనలు
- ఎక్స్ వేదికగా కేటీఆర్
- నా వ్యాఖ్యలను వక్రీకరించారు
- బీఆర్ఎస్ హయాంలో మంత్రుల కమీషన్ల గురించే నేను మాట్లాడా
- నాపై కావాలనే కొందరి తప్పుడు ప్రచారం
- అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



అక్షరదర్బార్, ప్రధాన తినిధి :
రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు మరోసారి రాజకీయంగా దుమారం రేపాయి. ఫైళ్లను క్లియర్ చేసేందుకు మంత్రులు మామూలుగా డబ్బులు తీసుకుంటారంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు తాజాగా వివాదానికి దారితీశాయి. కమీషన్లు తీసుకునే మంత్రుల వివరాలు చెప్పాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారిపై విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. నిజాలు ఒప్పుకున్నందుకు మంత్రి కొండా సురేఖకు నా అభినందనలు అని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉంటే తాను చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని, బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో మంత్రుల కమీషన్ల గురించే తాను మాట్లాడానని అన్నారు. అయితే కొందరు కావాలని తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. గురువారం మంత్రి కొండా సురేఖ వరంగల్ లోని కృష్ణ కాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో రూ.5 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తమ వద్దకు వచ్చే వివిధ కంపెనీల ఫైళ్లను క్లియర్ చేసేందుకు మంత్రులు మామూలుగా డబ్బులు తీసుకుంటారు. మరి నేను అటవీ శాఖ మంత్రిగా ఉన్నందున నా వద్దకు కొన్ని కంపెనీల ఫైల్స్ క్లియరెన్స్ కోసం వస్తాయి. మామూలుగా అలాంటి ఫైలు వచ్చినప్పుడు మంత్రులు డబ్బులు తీసుకుని క్లియర్ చేస్తారు. అప్పుడు వాళ్లకు నేను మాకు నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. మీరు మా స్కూలు ఒకటి డెవలప్ చేయండి. మీ పేరు గుర్తుండిపోతుందని చెప్పానని అన్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో మంత్రుల కమీషన్ వ్యాఖ్యలు పొలిటికల్ గా సంచలనం కలిగించాయి. ప్రస్తుతం ఈ అంశం రాజకీయంగా హాట్ టాపిక్ అయింది.

### నా వ్యాఖ్యలను వక్రీకరించారు

**: మంత్రి కొండా సురేఖ**



తాను చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ శుక్రవారం స్పందించారు. వరంగల్‌లోని కృష్ణా కాలనీలో బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.4.5 కోట్లతో భవనం నిర్మించేందుకు ముందుకు వచ్చిందని, ఆ సందర్భంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులను ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేశానని, ఆ వ్యాఖ్యలను వక్రీకరించారని అన్నారు. తనపై కావాలని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలా చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అలా ప్రచారం చేసేవారు ఇప్పటికైనా మానుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రులు ఏ పనికైనా డబ్బులు తీసుకునేవారని ఆరోపించారు.

### - కమీషన్ సర్కార్ : కేటీఆర్



'మంత్రులు కమీషన్లు లేకుండా ఫైల్స్ ముందుకు వెళ్లవు అని సభాముఖంగా ప్రకటించిన మంత్రి కొండా సురేఖ గారికి నా అభినందనలు. మంత్రి కనీసం ఇప్పటికైనా కొన్ని నిజాలు బయట పెట్టినందుకు ధన్యవాదాలు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ సర్కార్ గా మారిపోయింది. ఇది రహస్యమే కాదు. ఓపెన్ సీక్రెట్' అని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వంలోమంత్రులు ఫైల్స్‌పై సంతకం చేసేందుకు 30 శాతం కమిషన్ తీసుకుంటున్నారని మండిపడ్డారు. కమిషన్ల వ్యవహారంలో సచివాలయంలో పలువురు కాంట్రాక్టర్లు ధర్నా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ ఘటనే ఈ ప్రభుత్వంలో మంత్రుల కమిషన్ల భాగోతాన్ని బహిర్గతం చేసిందని అభిప్రాయపడ్డారు. కమిషన్లు తీసుకుంటున్న మంత్రుల వివరాల్ని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 'ఇదే అంశంపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ మంత్రి చేసిన ఆరోపణలపై దర్యాప్తుకు ఆదేశించగలరా?' అని ప్రశ్నించారు.

# లీడర్ల బహిరంగ విచారణకు నో

- సూత్రప్రాయంగా కాళేశ్వరం విచారణ కమిషన్ నిర్ణయం
- న్యాయపరంగా చిక్కులు వద్దనుకోవడమే కారణం
- ఈ నెలాఖరులోపు సర్కారుకు నివేదిక

అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలోని మేడిగడ్డ బరాజ్ అనతి కాలంలోనే కుంగిపోయింది. సుందిళ్ల, అన్నారం బరాజ్ల పరిధిలో నిర్మాణ పరంగా లోపాలు తలెత్తాయి. దీని వెనుక ఉన్న కారణాలు తెలుసుకునేందుకు సర్కార్ నియమించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణను తుది దశకు తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో కమిషన్కు న్యాయపరమైన చిక్కులు ఎదురు కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నది. దీనిలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్, నాటి మంత్రి హరీశ్రావును బహిరంగంగా విచారించవద్దని సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీంతో కేసీఆర్, హరీశ్రావుకు ఊరట లభించినట్లయింది. మరోవైపు కమిషన్ ఇప్పటికే డాక్యుమెంట్ ఆధారాలతో ఫైనల్ రిపోర్ట్ సిద్ధం చేసింది. నివేదిక దాదాపు 400 పేజీలు ఉంటుందని సమాచారం. కమిషన్ ఈ నెల 20 తర్వాత ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నది. నివేదిక ఇచ్చేందుకు గడువు ఈ నెల 31 వరకు ఉండడంతో ఈలోపలే కమిషన్ ఆ పని పూర్తి చేయనున్నది. కమిషన్ను సర్కార్ గత ఫిబ్రవరిలో నియమించింది. 100 రోజుల్లో నివేదిక సమర్పించాలని సూచించింది. ఆ తర్వాత క్రమంగా కమిషన్ గడువును పొడిగిస్తూ వచ్చింది. రిపోర్ట్ రెడీ కాకపోవడంతో గడువును మే 31 వరకు ప్రభుత్వం పొడిగించింది.



# చదువుతోనే సమాజం బాగు

**చిట్యాల ఎంఈఓ రఘుపతి**

అక్షర దర్బార్,చిట్యాల : అందరూ విద్యావంతులైతేనే సమాజం సమూలంగా బాగుపడుతుందని చిట్యాల మండల విద్యాధికారి రఘుపతి అన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్ టీచర్ సమావేశాలు ఎంఈఓ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఎంఈవో కోడేపాక రఘుపతి మాట్లాడుతూ అందరూ విద్యావంతులైనప్పుడే సమాజం బాగుంటుందన్నారు. 15 సంవత్సరాలు పైబడిన పిల్లలు సైతం ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ప్రాథమిక విద్య, వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బైరం కల్పన, ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీరామ్ రఘుపతి, మహిళా సంఘం నాయకురాళ్లు,,




అంగన్వాడి టీచర్లు భాగ్యలక్ష్మి,మరియు విఓ చందర్, కోమల ఉపాధ్యాయులు బండారి సదయ్య, గోపగాని భాస్కర్, బొమ్మ.రాజమౌళి మరియు విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు

# అదుపుతప్పి టిప్పర్ బోల్తా



అక్షర దర్బార్ మల్హర్ : అదుపుతప్పి బొగ్గు టిప్పర్ బోల్తా పడిన సంఘటన మండలంలోని కొయ్యుర్ గ్రామపరిదిలోని బొగ్గుల వాగువద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.టిప్పర్ డ్రైవర్ కు నిద్రలేకనే టిప్పర్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కాల్వలో బోల్తా పడింది.డ్రైవర్ కు స్వల్ప గాయాలు కాగా బారి ప్రమాదం తప్పింది. ఇసుక,బొగ్గు లారీలు అడ్డుఅదుపు లేకుండా వేగంగా వెళ్లడంతో లారీల,తిప్పర్లు బోల్తా కొట్టడం,ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.





ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ



ఆరోగ్య శిబిరం వద్ద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

# భక్తులకు ఇబ్బందులు కలగనివ్వొద్దు

- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**
- **రెండవ రోజు సరస్వతి పుష్కరాల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్**
- **కాలినడకన తిరుగుతూ భక్తులతో సౌకర్యాల ఏర్పాట్లపై ఆరా**

అక్షరదర్బార్, కాళేశ్వరం:
జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సరస్వతీ పుష్కరాలు రెండో రోజు కాళేశ్వరంలో స్టాళ్లు, టెంట్ సిటీ, సరస్వతి ఘాట్ వద్ద భక్తులకు పుష్కర ఏర్పాట్లు, సౌకర్యాలు, మరుగుదొడ్లు, షవర్స్, ఘాట్స్, చలి వేంద్రం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాళ్లు, జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఖైదీలు తయారు చేసిన హ్యాండ్ మేడ్ వస్తువుల స్టాల్ ప్రారంభించారు. వివిధ స్టాళ్లు పరిశీలించి వ్యాపారాల గురించి అడిగి తెలుసుకున్నారు. చలి వేంద్రాల్లో మంచినీటి సరఫరాను పరిశీలించారు. త్రివేణి సంగమం వద్ద భక్తులకు మంచినీటి సరఫరాకు చలి వేంద్రం ఏర్పాటు చేయాలని తక్షణమే వాకిటాఖీ ద్వారా ఆర్ డబ్ల్యూఎస్ ఈఈని ఆదేశించారు. మంచినీరు అందుతున్నదా? మరుగుదొడ్లు, స్నానాల షవర్స్ ఎలా ఉన్నాయంటూ భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల అభిప్రాయాలను తెలుసుకొని అధికారులకు తగిన సూచనలు చేశారు. త్రివేణి సంగమంలో భక్తులు స్నానాలకు వెళ్ళడానికి వెళ్లు మార్గంలో పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, దాని వల్ల భక్తులు వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారని, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మార్గంలో ఎలాంటి పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వహించొద్దని సూచించారు. పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వాహణకు కేటాయించిన ప్రాంతంలో మాత్రమే పిండ ప్రదానాలు నిర్వహించాలని సూచించారు. వ్యర్థాలు గ్రామ పంచాయతి ఏర్పాటు చేసిన డస్ట్ బిన్స్ లో వేయాలని, త్రివేణి సంగమంలో వేయొద్దని, భక్తులు నది పవిత్రను కాపాడాలని సూచించారు. అనతరం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాల్ లో భక్తులతో ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పరిశ్రమల శాఖ జిఎం సిద్ధార్థ, డీఆర్డీఓ నరేష్, డీటీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

**భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే**



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్ : సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శుక్రవారం దేవాలయంలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ఎస్పీ మార్గ నిర్దేశం చేశారు. భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఓపిగ్గా విధులు నిర్వహించాలని, తొక్కిసలాట జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎస్పీ పోలీసులను ఆదేశించారు.

# ప్రభుత్వ బడులను ప్రోత్సహించండి

**-మొగుళ్లపల్లి ఎంఈఓ కుమారస్వామి**



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి పాఠశాలల బలోపేతానికి గ్రామస్తులందరూ కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని మొట్లపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో తల్లిదండ్రుల- ఉపాధ్యాయుల సమావేశం గ్రామ ప్రత్యేక అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలను కల్పిస్తూ విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం, ఉచిత పుస్తకాలు, దుస్తులు, పౌష్టికాహారమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. పదో తరగతి ఫలితాల్లో 100% ఉత్తీర్ణత సాధించామన్నారు. గ్రామంలోని 15 సంవత్సరాలు పైబడిన వారందరూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ప్రాథమిక విద్య, వృత్తి నైపుణ్యాల పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందంతో కలిసి గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

# తొర్రూరు మున్సిపాలిటీకి నూతన ల్యాడర్

**పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్**

అక్షర దర్బార్, తొర్రూరు : మున్సిపాలిటీకి నూతన ల్యాడర్ కొనుగోలు చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయానికి ల్యాడర్ తీసుకొచ్చిన సందర్భంగా ఎలక్ట్రిషియన్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మెయిన్ రోడ్డుపైన ఉన్న ఐమాస్ట్ లైట్లను రిపేర్ చేయడానికి నూతన ల్యాడర్ కొనుగోలు చేయడం జరిగిందని, దీని విలువ రూ.రెండు లక్షల 20 వేల రూపాయలతో కొనుగోలు చేశామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రంజిత్, మేనేజర్ కట్టాస్వామి, ఎలక్ట్రిషియన్స్ తదితరులు పాల్గొన్నారు.



# స్వాగత తోరణం

- వేగవంతంగా సాగుతున్న పలు అభివృద్ధి పనులు
- పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



అక్షరదర్బార్, జనగామ: పట్టణ కేంద్రంలోని హన్మకొండ బై పాస్ రోడ్డులో స్వాగత తోరణం ఏర్పాటు పనులను, హైదరాబాదు రోడ్డు, పెంబర్తి బై పాస్ లో జంక్షన్ అభివృద్ధి పనులను, బతుకమ్మ కుంట సుందరీకరణ పనులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించి, సంబంధిత వివరాలపై ఆరా తీసి మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పనులను మరింత వేగవంతం చేయాలని, నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ పర్యవేక్షణలో కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ మహిపాల్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

### వ్యవసాయ మార్కెట్ లో బీఆర్ఎస్ నాయకుల నిరసన

అక్షర దర్బార్, తొర్రూరు : ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కాంటలు వేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేస్తూ... తొర్రూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సంధర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... రైతులు కష్టపడి పండించిన పంటలను నెలలు తరబడి కొనుగోలు చేయకుండా, కేంద్రాల్లో పేరుకుపోయేలా చేయడం వల్ల ధాన్యం వర్షాల కారణంగా పాడవు తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని రైతన్నలు కన్నీరు పెట్టుకుంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. తొర్రూరు మండలంలో 19 కొనుగోలు కేంద్రాల్లో ఒక్క కేంద్రంలో కూడా పూర్తిగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగియలేదని తెలిపారు. రైతులు ఎండలో నిలబడి, ఎదురు చూస్తుండగా పిట్టల్లా రైతులు వడదెబ్బతో అస్వస్థతకు గురవుతున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జెడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు బిందు శ్రీనివాస్, పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్ రెడ్డి, పార్టీ కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు ఎన్నమనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.







- భక్తులతో ఘాట్లు కిటకిట
- సరస్వతి ఘాటు వద్ద పుణ్యస్నానాలు
- కాళేశ్వరం సందర్శించిన డిప్యూటీ సీఎం, ప్రత్యేక పూజలు

# ఆధ్యాత్మిక చైతన్యం

**అక్షరదర్బార్, కాళేశ్వరం:**

సరస్వతి పుష్కరాలను పురస్కరించుకొని శుక్రవారం కాళేశ్వరంలోని ఘాట్లు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పుష్కర స్నానాల కోసం సరస్వతి ఘాట్ చేరుకొని పుణ్యస్నానాలు ఆచరించారు. పుష్కర స్నానానికి ఎంతో పవిత్రత కలిగిన ఈ సందర్భాన్ని భక్తులు ఆధ్యాత్మికంగా జరుపుకున్నారు. భక్తుల రాకతో ఘాట్ల వద్ద ఆధ్యాత్మిక చైతన్యం కనిపించింది. అధికారులు భక్తులకు మార్గనిర్దేశనం చేశారు. పుష్కర స్నానంతో పాటు భక్తులు నదీ తీరాల్లో హారతులు సమర్పిస్తూ, దానం చేస్తూ తమ ఆధ్యాత్మికతను చాటుకున్నారు. పుష్కరాల వేడుకలు ఇంకా 10 రోజులు కొనసాగనున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం లో త్రివేణి సంగమం వద్ద గురువారం సరస్వతి పుష్కరాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ ప్రారంభోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రులు డి శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తదితరులతో కలిసి పాల్గొన్నారు. సరస్వతి పుష్కరాల రెండో రోజు శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాళేశ్వరం సందర్శించి పుష్కర స్నానం ఆచరించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనతోపాటు పలువురు వీఐపీలు ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

## సరస్వతీ పుష్కర స్నానం పరమ పవిత్రం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రథమం సరస్వతీ పుష్కరం
ఆధ్యాత్మిక జీవన శైలిలో తగిన మోక్షం
వెల్లువెత్తుతున్న భక్తి పారవశ్యం
కుటుంబాలతో కాళేశ్వరం పయనం
దక్షిణ కాశీ గా పేరు గాంచిన కాళేశ్వరం కి
వివిధ రాష్ట్రాల భక్తులతో పోటెత్తితున్న జనం
జ్ఞానానికి సంస్కృతికి విద్య కు ప్రతి రూపం సరస్వతే పుష్కరం
వేద కాలం నుండి సరస్వతీ నదికి గల గౌరవం అపారం
ఋగ్వేదం లో సప్తదీ సింధూ మాత గా నామ కరణం
సరస్వతీ అంటేనే కనపడని చైతన్య ప్రవాహం
గురు గ్రహం మిధున రాశి లో ప్రవేశం తో పుష్కరాల ఆరంభం
ప్రతీ పన్నెండు ఏళ్ల కో సారి ఆగమనం
సరస్వతీ నది భూమి మీద కనిపించని అదృశ్య ప్రవాహం
దక్షణ భారత్ దేశం లో సరస్వతీ పుష్కరము తో కాళేశ్వరం ప్రసిద్ధం
స్నాన తర్పణ పూజలు పిండ ప్రదానాలచే జన ప్రవాహం
పుష్కర స్నానం శరీర శుద్ధి ఆత్మ శుద్ధి తో మమేకం
చీమల బారుల్లా కదులు తున్న భక్త జనం
ఎండ వేడిమిని లెక్క చేయని పైనం
సరస్వతీ మాత కి జై కొడదాం పుష్కరాలు
విజయ వంతం చేద్దాం




కామిడి సతీష్ రెడ్డి
భూపాలపల్లి జిల్లా
9848445134


## అంగడి ప్రారంభం



అక్షర దర్బార్,రేగొండ : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో నూతన మార్కెట్ (అంగడిని) ప్రారంభించారు.గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం గ్రామంలో కూరగాయల మార్కెట్ జరిగే విధంగా ఏర్పాటు చేశారు. గవర్నమెంట్ స్కూల్ సమీపంలో క్రయదారుల కు, విక్రయదారులకు అన్ని వసతులు ఏర్పాటు చేసి ప్రతి శుక్రవారం మార్కెట్ జరిగే విధంగా అన్ని చర్యలు చేపట్టారు.అన్ని రకాల కూరగాయలు, పండ్లు, వివిధ రకాల సరుకులతో నూతన అంగడిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మమత, పలు పార్టీల నాయకులు నిమ్మల విజేందర్, దేశ్మి సాంబయ్య, రొంటాల వెంకటస్వామి, రావుల తిరుపతి, పల్నాటి శ్రీను, పర్శ సురేష్, ఇండ్ల బిక్షపతి, గ్రామ కారోబార్ రఘుపతి , గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## నాగూర్ల ఆశీర్వాదాలు



అక్షర దర్బార్, పరకాల : హనుమకొండ జిల్లా పశ్చిమ నియోజకవర్గం సుబేదారి భాషిత్ నగర్ చెందిన ఎండిగ లలిత లక్ష్మీకాంత రావు కుమార్తె శైలజ శ్రీకాంత్ ల వివాహానికి, దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన చంద్రగిరి మాధవి రవీందర్ గౌడ్ కుమార్తె ప్రియవర్షిని తరుణ్ కుమార్ గౌడ్ ల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు. వారితో పాటు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జెండా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేరస్తుల మూలాలను కనిపెట్టాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- వెస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల సందర్శన





అక్షరదర్బార్, హనుమకొండ:
ఆర్థిక సైబర్ నేరాలకు సంబంధించి కేవలం కేసు నమోదు చేయడమే తమ బాధ్యతని కాకుండా నేరానికి పాల్పడిన నేరస్థుల మూలాలను కూడా దర్యాప్తు అధికారులు కనిపెట్టి నిందితులను అరెస్టు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. శుక్రవారం ఆయన వెస్ట్‌జోన్ పరిధిలోని చిల్పూర్, తరిగొప్పుల, నర్మెట్ట, జనగామ పోలీస్ స్టేషన్లతో పాటు వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సందర్శించిన సీపీ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సంబంధిత స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగారు. ఆయా స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి, ఎన్ని సెక్టార్లు ఉన్నాయి, సెక్టార్‌వారిగా ఎస్ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు, వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్ఐ ద్వారా తెలుసుకున్నారు. స్టేషన్‌వారీగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలపై స్టేషన్ అధికారులను అడిగారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు పలుసూచనలు చేస్తూ ప్రతి స్టేషన్ అధికారి తప్పునిసరిగా రౌడీ ఇండ్లను సందర్శించి వారి స్థితిగతులపై ప్రత్యక్షంగా ఆరా తీయాలని చెప్పారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి క్రయ విక్రయాలపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకు నిరంతరం పనిచేయాలని, నేరాల నియంత్రణకు విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకోసం నిరంతం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని స్టేషన్ అధికారులకు సూచించారు.

### సమావేశ ప్రాంగణం ప్రారంభం

జనగామ ఏసీపీ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన వెస్ట్ జోన్ పోలీస్ అధికారుల సమావేశ ప్రాంగణాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో సీపీ పండ్ల మొక్కలను నాటారు. పోలీస్ కమిషనర్ వెంట డీసీపీ రాజమహేంద్ర నాయక్, జనగామ ఏఎస్పీ చైతన్య నితిన్, ఏసీపీలు భీంశర్మ, నర్సయ్య, ఇన్ స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# స్టాళ్లు పరిశీలించిన మంత్రి

అక్షరదర్బార్, కాళేశ్వరం: సరస్వతి పుష్కరాల నేపథ్యంలో పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు అందుబాటులో ఉండే సదుపాయాలను, సేవలను సమీక్షించేందుకు మంత్రి శ్రీధర్ బాబు విస్తృతంగా పర్యటించారు. ఘాట్ల వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లు, భక్తులకు సరఫరా చేసే తాగునీరు, ఆరోగ్య సదుపాయాలు, భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతుందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. స్వచ్ఛత, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, శాసన సభ్యులు మక్కన్ సింగ్, పరిశ్రమల శాఖ జీఎం సిద్దార్థ, డీఆర్డీఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టాళ్లు ఏర్పాటు చేసిన వారితో ఫోటోలు దిగి అభినందించారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు





# కార్యకర్తల కష్టాన్ని మరువను

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- దుగ్గొండి,నర్సంపేట,నల్లబెల్లి మండలాల్లో పార్టీ సంస్థాగత, నిర్మాణ సన్నాహక సమావేశాలు




అక్షర దర్బార్, దుగ్గొండి,నర్సంపేట,నల్లబెల్లి@ కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ప్రజల రుణం ప్రతి కార్యకర్త కష్టాన్ని ఎన్నడూ మరువనని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం నర్సంపేట డివిజన్లోని దుగ్గొండి నల్లబెల్లి నర్సంపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత,నిర్మాణ సన్నహాక సమావేశాన్ని ఆయా మండలాల మండల పార్టీ అధ్యక్షులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అబ్జర్వర్ అమర్ అలీ ఖాన్, మేడి రవిచంద్ర,వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తో కలిసి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గారు మాట్లాడుతూ నియోజకవర్గంలో రాబోయే కాంగ్రెస్ పార్టీ కమిటీ కమిట్మెంట్ తో పనిచేసే నాయకత్వాన్ని ప్రోత్సహించండని,కాంగ్రెస్ పార్టీయే నా గ్రూపు అన్నారు.సమర్థ నాయకత్వం ద్వారానే పార్టీ బలోపేతం అవుతుందని,ప్రజలకు కార్యకర్తలకు సేవ చేసే నాయకత్వాన్ని ఎంపిక చేయండన్నారు.కాంగ్రెస్ పార్టీలో పదవైన,ప్రజా ప్రతినిధి పదవి అయినా పార్టీకి ప్రజలకు సేవ చేయాలని,బాధ్యత గా నిర్వహించే నాయకత్వాన్ని ప్రోత్సహించాలన్నారు. గ్రూపులను ప్రోత్సహించకుండా, కష్టపడ్డా కార్యకర్తకు పార్టీలో గుర్తింపు లభిస్తుందన్నారు. 2017కు ముందు నుండి పార్టీ మారకుండా కాంగ్రెస్ పార్టీ లో కష్టపడ్డ వారికి బ్లాక్ అధ్యక్షులు,మండల, వార్డు,గ్రామ అధ్యక్షులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పిసిసి సభ్యుడు పెన్నెం రామానుజన్ బొంపల్లి దేవేందర్ రావు మండల పార్టీ అధ్యక్షుడు గులాబ్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారులతో మండుటెండల్లో పనులు

అక్షర దర్బార్, మహబూబాబాద్ : చిన్న పిల్లలు అనే దయ లేదు. కూలీ డబ్బులు మిగులుతాయని కక్కుర్తిపడి ఓ తునికాకు కాంట్రాక్టర్ చిన్నారులకు రూ.20 ఇస్తానని ఆశ చూపి మండుటెండలో కల్లంలో పనులు చేయించడం మండలంలో చర్చనీయాశంగా మారింది. వివరాల్లోకి వెళితే... మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని పూనుగొండ్ల యూనిట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ గంగారం మండలంలోని పునుగొండ్ల గ్రామంలో తునికాకు సేకరిస్తున్నాడు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి కట్టలు తడిశాయి. వాటిని దులుపుకుంటూ తిప్పి పెట్టాల్సి ఉంటుంది. అందుకు పెద్దవారిని పనికి పిలిస్తే ఒక్కరికి కూలీ రూ.400 ఇవ్వాల్సి వస్తుంది. అది మిగిల్చుకోవాలనే కక్కుర్తితో స్థానికంగా కనిపించిన చిన్నారులకు 1000 కట్టల తిప్పివేస్తే రూ.20 ఇస్తానని చెప్పి మండుటెండలో పనులు చేయించుకుంటున్నాడు. అధికారులు స్పందించి చిన్నారులతో పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# రికార్డ్ స్థాయిలో వరి సాగు

- 139 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మంత్రులు, అధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్




అక్షరదర్బార్, వరంగల్:

ఈ సారి రాష్ట్రంలో యాసంగి సీజన్ లో రికార్డు స్థాయిలో వరి ధాన్యం సాగు అయ్యిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణను ఓ మహా యజ్ఞంలా భావిస్తూ, రైతుల నుంచి ప్రభుత్వం పెద్ద ఎత్తున మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోందని ఆయన తెలిపారు. హైదరాబాదు నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో యాసంగి ధాన్యం సేకరణపై రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ సన్నలకు బోనస్ సైతం చెల్లించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 60.14 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, 129.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని వివరించారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 8329 కొనుగోలు కేంద్రాల ద్వారా 70.13 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 49.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలను సేకరించడం జరిగిందన్నారు.

**- రెట్టింపు స్థాయిలో సేకరణ**

గడిచిన మూడేళ్లలో పోలిస్తే ఈసారి దాదాపు రెట్టింపు స్థాయిలో ధాన్యం సేకరణ జరుపుతున్నామని ఉత్తమ్ తెలిపారు. 2022-23 యాసంగిలో 25.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరుగగా, 2023 -24లో 32.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయన్నారు. ఈ ఏడాది యాసంగికి సంబంధించి ఇప్పటికే 49.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయ్యిందని వివరించారు. ఇంకనూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెస్తున్నందున కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యంగా లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని మంత్రి అన్నారు. జిల్లా కలెక్టరేట్ నుంచి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద పాల్గొని జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల గురించి మంత్రులకు వివరిస్తూ జిల్లాలో 182 ధాన్యం కొనుగోలు సెంటర్లలో 2024- 25 రబీ సీజనుకు గాను జిల్లా నుంచి రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణ అంచనా వేయగా ఇప్పటివరకు దాదాపు 87 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో అన్ని ఏర్పాట్లు చేశామని, నిత్యం పర్యవేక్షణ చేయడం జరుగుతున్నదని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ జిల్లా నుంచి డీసీఓ నీరజ, డీఏఓ అనురాధ, డీఆర్డీఓ కౌసల్యదేవి, సివిల్ సప్లై డీఎం సంధ్యారాణి, డీఎస్ఓ కిష్టయ్య తదితరులూ పాల్గొన్నారు.


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278★ RNI NO. TELTEL/2022/81915